జ్యోతి కథల పోటీలో ప్రత్యేక ప్రశంస పొందిన కథ

# "రాలేనమ్మా, రాలేను"

ఇచ్ఛాపురపు రామచంద్రం

సీతాలుకి దుఃఖం వొచ్చేస్తూంది.

ఏటికి పోటొచ్చినట్లు ఏడుపొచ్చేస్తూంది.

గుండె పగిలిపోయేలా వుంది.

గొంతు తెగిపోయేలావుంది.

"నాన్నా నాన్నా నాన్నా "

దిగంతాలు మార్మోగేలా అరిచింది.

అరిచి అరిచి అలసిపోయింది.

సీతాలుకి శోషొస్తూంది. ఈ క్షణమో మరు క్షణమో మొదలు నరికిన తరువులా దభాలున నేలకూలి పోయేటట్లుంది. అయినా ఓపికతెచ్చుకుని—తనలో వున్న శక్తినంతటినీ ఒక్కసారి కూడ దీసుకుని అదేచివరి సారన్నట్లూ, యిక తనతరం కాదన్నట్లూ ఆశగా ఆత్రంగా అరిచింది "నాన్నా, రావూ? రావూ?"

ఒంటి కంటితో అతనొస్తున్నాడేమో అని చూసింది!

ఒంటి కాలితో కుంటికాలితో.. .రెండడుగులు వేసింది. అతన్నందుకుందు కన్నట్లు. అతనందలేదు—ఆమె పిలుపుకీ. .చూపుకీ పరుగుకీకూడా.

నిలువునా కూలిపోయింది—ఆమె అన్ని ఆశలలా.

ఆమె కళ్ళముందు చీకట్లు క్రమ్ముతున్నాయి. ఇన్నాళ్ళూ ఎదురుచూసిన క్షణం వొచ్చి—వెక్కిరిస్తూ వెళ్ళిపోయింది.

ఆమె ఏడుస్తూంది . "నాన్నా! నేను నాన్నా నీ సీతని....నీ రెండో అమ్మాయిని. నీతో కలసి అన్నం తినేదాన్ని. నువ్వెంత రాత్రికి వొచ్చినా మేలుకొని కూర్చుని నువ్వు కలిపి పెడితేగాని బువ్వ తిననని గారాము చేసిన సీతని నాన్నా. నన్ను మరచిపోయావా? చాల కాలమేమీ ఐనట్లు నా కనిపించడం లేదే! ఇంటికి దూరమై ఎన్నాళ్ళయిందో నాకు తెలియదు. నువ్వు నన్ను మరచిపోయావేమో కానీ నేను నిన్ను మరచిపోలేదు నాన్నా. నువ్వు నన్ను వెతుకుతున్నావో లేదో కాని నేనింకా నిన్ను వెతుకుతూనే వున్నాను.

అమ్మ ఎలావుంది? అక్క ఎలా వుంది? ఎన్నో అడుగుదా మనుకున్నాను. నన్నెందుకు వినిపించుకోలేదు నాన్నా? నిజంగా నన్నుమర్చిపోడం నీకు సాధ్యమేనా? నేను—నీ సీతని నీ సీతని నాన్నా

*　　　*　　　*

"అమ్మాయి వయస్సు ఎనిమిది. అందంగా బొద్దుగా వుంటుంది. కళ్ళు చక్రాల్లావుంటాయి. పేరు సీత. నీలం జాకెట్టూ, ఆకుపచ్చ పరికిణీ కట్టుకుంది. చెవులకి బంగారు రింగులున్నాయి. ఇంకేమీ నగలులేవు వొంటిమీద. నిన్న సాయంత్రం ఆడుకుందుకు వెళ్ళింది. ఎంతకీ రాలేదు. శాయశక్తులా వెదికాం. ఫలితం లేక పోయింది. ఇన్స్పెక్టర్ నా సీతని వెదికించి నాకప్పగించరూ?" గాద్గదిక కంఠంతో ప్రాధేయ పడుతున్నట్లు అన్నాడు గోపాలరావ్.

"మీరేం చేస్తుంటారు?"

"టీచర్ని. స్కూలు టీచర్ని. నేను లేక పోతే అన్నమేనా తినదు సీత. దయచేసి మీలు

అయినంత తొందరగా సీతని వెదికించరూ?"

"ప్రయత్నిస్తాం. రిపోర్టు సంతకం చేసి మీరు వెళ్ళండిక."

"సార్...."

"చెప్పానుగా చూస్తామని" విసుగొచ్చింది సబినస్పెక్టరాఫ్ పోలీస్‌కి. ఔను. తప్పిపోయింది అతని సీతకాదు. కనీసం ఓ ఆఫీసరుగారి అమ్మాయేనా కాదు. ఓ టీచరు సీత. ఎద్దు పుండు కాకికి నొప్పికాదు. స్కూలు టీచరు సీత సబినస్పెక్టరుగారికి ముద్దుకాదు. కనుకనే-

"దేనికయినా యోగముండాలి. దైవం అనుకూలించకపోతే మానవ ప్రయత్నం ఫలించదు. గుండె రాయి చేసుకో" అని చివరి మాటగా అర్ధాంగితో చెప్పెయ్యవలసి వచ్చింది గోపాలరావుకి — పోలీసు రిపోర్టిచ్చిన ఆరు నెలల అనంతరం.

* * *

చీకటి పడుతున్నా ఆటలు పూర్తవలేదు. సీత దొంగ అయింది. కళ్ళకి గంతలు కట్టుకుని—తడుముకుంటూ నడుస్తూంది. ఎవరో అందారు చేతికి. "దొంగ" అరవబోయింది. నోరు నొక్కేశారు. ఏదో తియ్యని వాసన. భయం వొళ్ళు తెలియని తనం. కళ్లమూతలు పడుతూ బాబోయ్ ఏమౌతూంది? కళ్ళు తెరిచేసరికి కళ్ళ కెదురుగా జిల్లేడు మొక్కలు. కంటికి దగ్గరగా జిల్లేడు కొమ్మలు. ఆ మొక్కలూ కొమ్మలూ ఎందుకో?

"పాపా ఈ చాక్‌లెట్ తిను యిటు చూడు."

చాక్‌లెట్ వేపు చూసింది. కళ్ళలో యేదో పడింది. ఒక కంటిలోనే. భగ్గుమని మంటలు. కెవ్వున కేకవేసి ఏడుపు లంకించుకుంది. వాళ్లు తినడానికేదో పెట్టారు. తింది—ఆకలికి వుండలేక. నిద్రవొచ్చేసింది. లేచాక—ఒక కన్ను మండుతూనే వుంది. రెప్ప తెరవడానికి వీలు లేకపోయింది.

వారం పదిరోజులకు తెలిసిపోయింది. తనెవరో ఎత్తుకొచ్చారు. వాళ్ళు-కావాలని తనని గుడ్డిదాన్నిచేసి వదిలారు. ఆవేళ తనకోసం

# రచయితను గురించి



జననం: 1940. విద్యార్హత: బి.ఏ.ఎకనమిక్స్. రచనపరంగా : అడగని వాళ్ళదీ అచ్చెయ్యని వాళ్ళదీపాపం అన్నధోరణిలో యీ మధ్యవరకూ తెగరాసి — అంటే 150-200 కథలూ, 15-20 నవలికలూ, 5-6 నవలలూ- యిక అలసి- యీ మధ్య నుంచే ఉధృతం తగ్గించాను. కొంచెం రెగ్యులర్‌గా పత్రికలు చూసేవాళ్ళకి నా కథలు తగులుతూనే ఉంటాయి. జ్యోతిలోనూ చాలానే రాశాను.

నా నమ్మకం—"కథకయినా నవలకయినా నవ్యతే ప్రాణం" అని. ధ్యేయం "ఏ రెండూ ఒకలా ఉండనంతకాలం రాసుకుంటూ పోవడం."

అభిమాన రచయితలు:—కథలకు మా అన్నయ్య ఐ. జె. రావూ, నవలలకి పురాణం సుబ్రహ్మణ్య శర్మా.

ప్రస్తుతం—L.I.C.లో పనిచేస్తూ అనకాపల్లిలో నివాసం.

ఇప్పటి కింతే సంగతులు

—ఇచ్ఛాపురపు రామచంద్రం

లారీ వచ్చింది. దాన్నిండా తనలాటి పిల్లలే. లారీలో తీసుకువెళ్ళారు తనని. రోడ్లుకలిసే చోట ఓ గోనెపరచి కూర్చోపెట్టారు. ఆవూరు కొత్తది. ఆ మనుషులు కొత్తవాళ్ళు. ఆ భాష కొత్త.

మొదట ఒకటి రెండురోజులు యెవరో కూర్చుని—"ఈ గుడ్డిదానికి ధర్మం చేయండి. పిల్లముఖంచూసి పైసా వెయ్యండి" అనిరోడ్డు మీద పోయేవార్ని నడిగేవారు. తరువాత తనం తట తానే అడుక్కునేది. ఆ భాష కొంచెం తెలిసింది. పారిపోదామని ప్రయత్నించింది. ఊరి పొలిమేరలు దాటకుండానే సేట్ జీ మనుషలు పట్టేశారు. పట్టి—

తలుచుకుంటేనే భయంగావుంది. కూర్చోబెట్టి—కాళ్ళు చాపమని—మోకాలి దగ్గర—కర్రబండతో ఒకే ఒకదెబ్బ- ప్రాణాలు పోయాయేమో అనిపించేంత భయం. గొల్లున గోల. అలా కుంటిదాన్ని చేశారు. గుడ్డిదీ కుంటిదీ కూడా అయ్యాక తనకి దినాదాయం పెరిగింది. అది గమనించి సేట్ నవ్వాడావేళ. "దెబ్బకి రెండు పిట్టలు."

తనెంత బాధపడితే వాళ్ళకేం?

"చీకటీ, నువ్వు మా నాన్నకిచెప్పు. నువ్వు తప్ప నాకెవరుచేస్తారు సాయం? మనుషలని ఎత్తుకుపోయి ఇలా కుంటివాళ్ళనీ గుడ్డివాళ్ళనీ ఎందుకు చేస్తారని నాన్నకి సందేహంగా వుంటుందేమో. వాటికి జవాబుగానూ వుంటుంది. నా బతుకెలాటిదో తెలియనూ తెలుస్తుందని చెబుతున్నాను. వినీ—అందచెయ్యి. నేను పెద్దగా మాటలాడుతున్నానని ఆశ్చర్యపడకు. పరిస్థితులూ అనుభవాలూ మనిషిని వయసు కంటె త్వరగా పెద్దచేసి వదలి పెడతాయ్. సరే. ఆ విషయానికేం.

పిల్లల నెత్తుకుపోయే ముఠాకి చిక్కాను. కుంటికీ గుడ్డికీ భిక్షం దొరుకుతుందని నన్ను వాళ్ళు గుడ్డిదాన్నీ కుంటిదాన్నీ చేశారు. ఒక విధంగా నేను నయమే. కొందరాడ పిల్లల నయితే వయస్సు వచ్చేవరకూ పెంచి విదేశాలకు అమ్మేయడమో, ఈ దేశంలోనే వ్యభిచారులుగా మార్చెయ్యడమో చేస్తాడట మా సేట్ జీ. ఎక్కడెక్కడినుంచీ పిల్లల నెత్తుకొస్తారు. మా దినచర్య—తూరుపు తెల్లారక మునుపు ప్రారంభమవుతుంది. లారీలలో మమ్మల్నందరినీ యెక్కించి యెవరి స్థలాలకు వారిని చేరుస్తారు. అక్కడనుంచి మేమడుక్కోవడం ప్రారంభిస్తాం. రోజు సంపాదనలోకొంత భాగం సేట్ కి పోతుంది. మిగిలింది మా తిండికీ గుడ్డకీ. ఏనాటికీ నా బతుకిక్కడ ఇంతే.

ఉండీ ఉండీ అమ్మా నాన్నా గుర్తుకొస్తారు. ఏడుపొస్తుంది. ఎవరూ ఓదార్చరు. పగలంతా అడుక్కోడంతోనే సరి. అరిచి అరిచి వుంటామేమో చీకటిపడి మెతుకులు తినేసరికి కళ్ళు మూతలు పడిపోతాయి. చదువుకుందామనుకున్నాను. నాన్నలా ఉద్యోగం చేద్దామనుకున్నాను. అమ్మలా పెళ్ళి చేసుకుందామనుకున్నాను. మంచిమంచి బట్టలు వేసుకుందామనుకున్నాను. ఏదీ కుదరలేదు. ఈ బతుకు నాకు విసుగొస్తూంది. సేట్ నా చుట్టూ యెటువంటి కాపలా వుంచుతాడంటే—చివరికి చావాలన్నా వాళ్ళకన్ను కప్పలేను. నాకీ నరకం ఏమీ బాగులేదు. అందుకే—నాన్నా, నన్ను మళ్ళీ ఇంటికి తీసుకువెళ్ళు. అమ్మతోనూ నీతోనూ ఆనందంగా ఉండనీ. ఏం నాన్నా రావూ? నాన్నా రావూ? నాన్నా రావూ?"

చీకటిలో దుఃఖపు ఛాయలు నింపుకుని. ఆమె ఆవేదన ఆలాపన అభ్యర్థన.

* * *

గోపాలరావ్ జుత్తుపీక్కున్నాడు. ముఖం దాచుకుని వెక్కివెక్కి ఏడుస్తున్నాడు. తనిక్కడికి రాకపోతే బాగుండేది. స్కూలు టీచరుకి కలకత్తా ప్రయాణమేమిటి? వచ్చినా. సీత కనబడకపోతే బాగుండేది. ఐనా-సీత ఎందుకు కనపడాలి తనకి? కనిపించినా—అలాగా ఆ వేషంలోనా?

ఇప్పుడేం చెయ్యడం?

ఈ అగ్నిపరీక్షనెలా యెదుర్కోడం?

సీత—కుంటిది.

సీత—ఒంటి కంటిది.

మొదట ఆనవాలు తెలియలేదు. కాని- ఆ గొంతు విని ఆ పిలుపువిని తను తడబడ్డాడు. సీతా అని పిలిచేకుండా ఎలా నిగ్రహించుకున్నాడో తనకే తెలియదు. సీతనలా చూసేసరికి గుండె నీరు అయింది. వాత్సల్యంతో హృదయం ఆర్ద్రమైంది. ఒక్కసారి స్వాధీనం తప్పి "సీతా" అని పిలిచేసే వాడే.

కాని—

కఠోరమైన వాస్తవం వివేకం—అడ్డుపడ్డాయి—గుండెకీ, గొంతుకీ.

ముఖంతిప్పుకున్నాడు. నడకవేగంపెంచాడు.

తనకు దగ్గరవాలని సీత సీతకి దూరమవాలని తను.

తనే గెలిచాడు. ఔను. సీత కుంటిది.

ఎంత బాధ పడిందో అమ్మాయి.

కాని—తనేం చెయ్యగలడు?


పరిస్థితులకు బందీ. సమాజంలో ఓ ఖైదీ. ఆ గోడలు దాటలేని అసమర్థుడు.

సీతా!

ఈ నాన్న ఆనాటి నీనాన్న కాదమ్మా.

ఆరుగురు ఆడపిల్లల తండ్రి. మీ అక్కకి పెళ్ళిచెయ్యటంలేదని బంధువులూ మీ అమ్మా పోరుతుంటే—ఇక్కడ చవకలో పెళ్ళికొడుకు దొరుకుతాడని విని వచ్చాను. నువ్వు కనిపించావు.

కాని నిన్నెలాగ ఇంటికి పిలువగలను? దురదృష్టవశాత్తూ — మధ్యతరగతి సంసారానికి ఒక్కొక్క ఆడపిల్లా ఒక్కొక్క శాపం. కనీసం పదివేలయినా పరిహారం చెల్లించక పోతే ఆ శాపానికి నిష్కృతి దొరకదు. నువ్వు





కాక ఐదుగురు. అంటే ఐదుపదులు. అంటే యాభై వేలు. అన్ని రూపాయలమాట దేముడెరుగు. పైసలయినా కూడ బెట్టగలనా అని నా అనుమానం. అదీకాక—నువ్వు ఆఇంట్లో సుఖపడేది ఏమీలేదు. యాచించి అయినా రెండుపూటలా యింత తిండి తినగలుగుతున్నట్లే వున్నావు నువ్వు. మధ్యతరగతి మిధ్యా ప్రతిష్టకులోనై అందుకూ నోచుకోలేదు నీ అక్క చెల్లెళ్లు. బడి పంతులిని. బండెడు సంతానమయితే కనగలిగాను కాని వాళ్ళకిమంచి పెంపకం అందించగలిగే ఆర్థిక స్తోమతెక్కడిది? మధ్య తరగతి కుటుంబం కనక—ఆకలి వేస్తున్నా అణచుకోవాలే తప్ప అడుక్కోలేరు. ఏ కూలో నాలోచేసి పొట్టపోసుకోలేరు. మిథ్యా గౌరవం మరి. అదీకాక—

నిన్ను వాళ్ళందరూ సరిగా ఆహ్వానించ గలరన్న నమ్మకమూ నాకులేదు. అంగ వైకల్యాన్ని హాస్యాస్పదమయిన విషయంగా తీసుకునేవారే తప్ప సానుభూతిచూపే సంస్కారుల సంఖ్య స్వల్పం. నీ ముఖంమీదే అనేస్తారు చుట్టుపక్కల వాళ్ళు —'అయ్యో! ఓ కన్నూలేదు, కాలూలేదు. నీకు పెళ్లెలా ఔతుందే? ఎంత డబ్బు కక్కుర్తివాడయినా బొత్తిగా నీలాటి దాన్నెలా చేసుకొంటాడు?'

అమాయకత్వం కొద్దీ పిల్లలూ, అజ్ఞానం కొద్దీ పెద్దలూ నీ మనసులో మాటల ముళ్ళు గుచ్చుతూంటారు. మీ అమ్మయితే, నిన్నిలా చూసి కుమిలికుమిలి ఏడుస్తుంది. నువ్వు ఆమెకు నిత్య సమస్యవౌతావు. అనుక్షణమూ మీఅమ్మ నీ గురించి దీని జీవితం ఎలా తెల్లవారుతుందా అని బెంగెట్టుక్కూర్చుంటుంది. ఇప్పటికే మీ అమ్మకి ఐదు దిగుళ్ళు. ఐతే—ఆ అయిదూ ఒకెత్తు. నువ్వు ఒకెత్తు. నువ్వు వస్తే యింట్లో యెటువంటి ఆతిథ్యం జీవితం భవిష్యత్తు లభిస్తాయో నా ఊహ మేరకు చెబుతున్నానంతే. నా గురించికూడా చెప్పెయ్యనీ. బాధగానూ సిగ్గుగానే ఉందనుకో. కాని తప్పదు. నిజం చెప్పేద్దామన్న దుగ్ధ నన్ను పీకుతోంది.

బడిపంతులినికదా? నలుగురిలోనూ పేరుంటుంది, పలుకుబడి శూన్యమయినా. అయిన దానికీ కానిదానికీ అప్పులుచేస్తూ సంసారయాత్ర సాగించే యెవరికి మాత్రం సంఘంలో పలుకుబడీ గౌరవమూ వుంటాయి. అయితే—అటువంటి వాళ్ళుకూడా నలుగురికీ తెలుస్తారు—వేరే కోణంనుంచి. అటువంటి పేరు నాకూ వుంది.

పలానా మాస్టారమ్మాయి చిన్నప్పుడు తప్పిపోయింది. కుంటీ గుడ్డీ ఐ—మళ్ళీ దొరికిందట. మాస్టారమ్మాయికి కన్నులేదు. కాలు లేదు. ఎలా వుంటుందో! చూద్దామా?

మీ పరిస్థితికి మా సానుభూతి. మీఅమ్మాయి ఎప్పుడు యెలా తప్పిపోయింది? మళ్ళీ యెలా దొరికింది. ఎక్కడ దొరికింది. ఆ అమ్మాయికి పెళ్ళి చేస్తారా? కష్టమే. గంతకుతగ్గ బొంత. ఎక్కడో కుంటివాడో గుడ్డివాడో దొరకాలి. అమ్మాయిఅదృష్టం బాగుంటే దొరుకుతాడేమో లెండి. అసలు మీ అమ్మాయి పుట్టుగుడ్డేనా? మొదటినుంచీ కుంటిదేనా? పూర్వజన్మలో యే పాపం చేశారో, లేకపోతే ఇదేమిటి? పుణ్యం కొద్దీ పురుషుడూ, దానంకొద్దీ బిడ్డలూ పూర్వులు ఊరికే అనలేదు.

ఇన్నాళ్ళూ మీ అమ్మాయి యెక్కడుంది? ఎలావుంది?

నన్నుచూస్తే చాలు. ప్రశ్నలు ప్రశ్నార్థకంలాంటి ముఖాలు. అవే ఎదురౌతాయి. వాటికి జవాబు చెప్పడం నాతరం కాదు సీతా. నాతరం కాదు.

అక్క తరవాత నువ్వే. అంటే నేను

చెయ్యవలసిన పెళ్ళి రెండోది..,నీదేఔతుంది. నీకు నేనెలాగూ పెళ్ళిచెయ్యలేను. పెళ్ళికొడు కుల కట్నంగప్పగలిగే డబ్బు సంచీలు నాదగ్గర లేవు. కనుక నీ పెళ్ళి నాకు అసాధ్యంగానే మిగులుతుంది ఏ నాటికీ. నువ్వింట్లో వుంటే నీ పెళ్ళికాకుండా నీ చెల్లెళ్ళకు పెళ్ళికాదు. పెద్ద పిల్లవుండగా మానేసి చిన్నవాళ్ళకి పెళ్ళేమిటి అంటారు. ఈ దేశంలో మన కుటుంబాలలో ఆడపిల్లకి జీవితమంటే పెళ్ళి. అంతే. అది నీకు నేను చెయ్యలేను.

నిన్ను చూసిన నువ్వు పలకరించబోయిన నాన్నా అని పిలవబోయిన—క్షణంలోనే నేను ఇవన్నీ ఆలోచించాననికాదు. నిజంగా నిన్ను చూసి గుర్తుపట్టిన క్షణంలో నాకు విపరీత మయిన భయంవేసింది. అందుకే నువ్వు "నాన్నా" అని పిలుస్తున్న కొద్దీ దూరంగా దూరంగా ఇంకా దూరంగా ఐపోయాను. నేను వట్టి పిరికివాణ్ని. అసమర్థుణ్ని. నన్ను క్షమిం చమని నిన్నడిగే అర్హతకూడా నాకులేదు.

సీతా! నీ బతుకు నువ్వే బతకాలి. కుంటి దానివీ గుడ్డిదానివీ ఐన నీకు ఆదరమూ ఆశ్ర యమూ అవసరం. కాని ఆ కారణాలుగానే వాటిని నీకివ్వలేక పోతున్నాను.

'నాన్నా, రావూ' అని నువ్వు ఏడుస్తూ ప్రాధేయపడుతూ, పిలుస్తున్న పిలుపు—యీ చీకటిలో నాకు వినపడుతూ నా గుండెలను మండిస్తూనేవుంది.

కాని—

సీతా!

నా అమ్మాయీ.

నేను రాలేనమ్మా. రాలేను.' □

# నవ్వితే నవ్వండి!

"సంవత్సరాల తరబడి మీ యింట్లో తిష్టవేసు క్కూర్చున్న మీ మామగారిపై పగసాధించే నన్నావు! ఎలా?"

"హైద్రాబాదు ట్రెయినెక్కించి ట్రెయిన్ టిక్కెట్టుకు బదులు ప్లాట్‌ఫారం టిక్కెట్టిచ్చి పంపించేశా!"

* * *

"నా పెళ్ళాం చిలకలా వుంటుంది!"

"అంత అందంగానా ?"

"కాదు. చెప్పిన విషయాన్నే మళ్ళీ మళ్ళీ చెప్పి బోర్ కొడుతుంది!"

* * *

"భోంచేసే ముందు నేను దేవుడ్ని ప్రార్థిస్తా "

"నాకా బాధలేదు! నా పెళ్ళాం బాగానే వండుతుంది!"

* * *

"మీ కథ నడిచే తీరు బాగాలేదే!"

"ఎలా బావుంటుంది? అందులోని హీరోయిన్ కుంటిదిగా?!"

* * *

"బలరామయ్య తమ్ముడా మీరు! నాకు ఇవాళ పొద్దున్నే తెలిసింది!"

"అదేంటి సార్? నేను 30 సంవత్సరాలుగా ఆయన తమ్ముడిగా వుంటున్నాను! మీరు ఇవాళే అంటున్నారే?"

సేకరణ: ఆర్. శివరాజన్